

ఊరంచుతండాలో పూజలు చేస్తున్న ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి

# సేవాలాల్ ఆశయాలను కొనసాగించాలి

- కేసీఆర్‌ప్రభు త్వంలోనే తండాల అభివృద్ధి : ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి

నవాబ్‌పేట, ఫిబ్రవరి 15 : గిరిజనుల ఆరాధ్య దైవమైన సేవాలాల్ మహరాజ్ సేవలు చిరస్మరణీయమని, ఆయన ఆశయాలను కొనసాగించాలని ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని ఊరంచుతండాలో గురువారం సేవాలాల్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో సేవాలాల్ జయంతిని నిర్వహించారు. భోగ్ బండార్‌లో ఎంపీ మన్నె పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనులు సంచార జాతులుగా మనుగడ సాగిస్తున్న కాలంలో వారిని ఏకం చేసి చైతన్య పరిచారన్నారు. నవాబ్‌పేట మండలంలో సేవాలాల్ ఆలయ నిర్మాణానికి కృషి చేస్తానని తెలిపారు. కేసీఆర్ ప్రభుత్వం గిరిజనుల అభ్యున్నతికి ఎంతో కృషి చేసిందన్నారు. ఏండ్లుగా అభివృద్ధికి ఆమడదూరంలో ఉన్న తండాలను గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేసి అన్ని రంగాల్లో ప్రగతి సాధించేలా కృషి చేశారని గుర్తుచేశారు. కార్యక్రమంలో ఎంపీపీ అనంతయ్య, జెడ్పీటీసీ రవీందర్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ నర్సిములు, వైస్ ఎంపీపీ సంతోష్ రెడ్డి, యువనాయకుడు అభిమన్యురెడ్డి, సేవాలాల్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు లింబ్యానాయక్, ఉత్సవ కమిటీ సభ్యులు చందర్‌నాయక్, శంకర్‌నాయక్, రాములునాయక్, నర్సింహానాయక్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సంత్‌సేవాలాల్ జయంతి వేడుకల్లో పాల్గొన్న మాజీమ ంత్రిని రంజన్‌రెడ్డి

# గిరిజనుల ఔన్నత్యానికి సేవాలాల్ కృషి

- మాజీ మంత్రి సింగిరెడ్డిని రంజన్‌రెడ్డి

వనపర్తి, ఫిబ్రవరి 15 : గిరిజనుల ఆరాధ్యదైవం సంత్ సేవాలాల్ మహరాజ్ అని, జాతి పునర్జీవనం, ఔన్నత్యానికి పాటుపడిన మహనీయుడని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని గిరిజన భవనలో గురువారం సంత్‌సేవాలాల్ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనుల సంక్షేమం కోసం దిశానిర్ధేశం చేసి హైందవ సంస్కృతిని పెంపొందించిన మహనీయుడని, మూఢనమ్మకాలను పారదోలి గిరిజనులను చైతన్యం చేశారన్నారు. నిజాం నవాబుకు వ్యతిరేకంగా పోరాటం చేసినందుకే మహరాజ్‌గంజ్‌గా అతడి పేరు మీద వెలిసిందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గట్టుయాదవ్, వైస్ చైర్మన్ శ్రీధర్, మీడియా కన్వీనర్ అశోక్, కౌన్సిలర్ లక్ష్మీనారాయణ, కృష్ణ, మహేశ్, రవి, కృష్ణ, రాములు, జంపన్న, బా షానాయక్, నాయకులు పరంజ్యోతి, ప్రేమ్‌నాథ్‌రెడ్డి, తిరుమల్, కృష్ణ, రహీం, గోపాల్ పాల్గొన్నారు.

# బంజారుల సంక్షేమానికి కృషి

- మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్



మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

పాలమూరు, ఫిబ్రవరి 15 : గిరిజనుల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహరాజ్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరమున్నదని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. జిల్లా కేంద్రంలో గిరిజన సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సేవాలాల్ మహరాజ్ జయంతి వేడుకల్లో పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వం గిరిజనుల సంక్షేమానికి ఎంతో పాటుపడిందన్నారు. తాను మంత్రిగా ఉన్న సమయంలో గిరిజన భవనానికి రూ.1.15 కోట్లు మంజూరు చేశామన్నారు. ఆలయం కోసం రూ.41లక్షలు ఇచ్చినట్లు తెలిపారు. గిరిజన విద్యార్థుల కోసం వసతిగృహం నిర్మాణం చేసినట్లు వెల్లడించారు. తండాలను పంచాయతీలుగా మార్చి పాలనను దరికి చేర్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ కేసీ నర్సింహులు, వైస్ చైర్మన్ గణేశ్, కౌన్సిలర్లు శ్రీనివాసులు, రాంలక్ష్మణ్, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, నవకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# కార్యకర్తలకు బీఆర్‌ఎస్ అండ

- అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు
- కార్యకర్తకుటుం బానికిరూ .2లక్షల చెక్కు అందజేత

అయిజ, ఫిబ్రవరి 15 : బీఆర్‌ఎస్ కార్యకర్తలకు ఎల్లప్పుడూ పార్టీ అండగా ఉంటుందని అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు అన్నారు. గురువారం మండలంలోని రాజాపురం గ్రామానికి చెందిన క్రియాశీల కార్యకర్త పెద్దయ్య కుటుంబానికి రూ.2లక్షల బీమా చెక్కును ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్‌లో క్రియాశీల సభ్యత్వం తీసుకున్న కార్యకర్తలకు బీమా పథకం వర్తింపజేస్తుండడంతో మృతిచెందిన కార్యకర్తల కుటుంబాలకు భరోసా లభిస్తుందన్నారు. దేశంలో ఏ పార్టీ అమలు చేయని విధంగా బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ కార్యకర్తల సంక్షేమానికి కృషి చేస్తున్నారన్నారు. బీఆర్‌ఎస్ బలోపేతానికి ప్రతి కార్యకర్త ప్రజల్లోకి వెళ్లి కేసీఆర్ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించాలన్నారు.

**క్రీడలతో మానసికోల్లాసం**

క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని ఎమ్మెల్యే విజయుడు అన్నారు. టీటీదొడ్డిలో గుండ్ల భీమరాయుడు బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని ఓపెన్ ఆల్ కబడ్డీ, సందెరాళ్లు ఎత్తే పోటీలను ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. గ్రామీణ క్రీడలు అంతరించిపోకుండా ఉండేందుకు ఓపెన్ ఆల్ కబడ్డీ పోటీలను నిర్వహించడం సంతోషకరమన్నారు. క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించాలన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, క్రీడాకారులు, నాయకులు పాల్గొన్నారు.



రాజాపురంలో కార్యకర్తకు టుంబానికిబీ మాచెకు ్కనుఅం దజేస్తున్న ఎమ్మెల్యే విజయుడు

## పూలతేరుపై విహరించిన
# చెన్నకేశవుడు


జడ్చర్ల, ఫిబ్రవరి 15 : జడ్చర్ల మండలంలోని గంగాపూర్ లక్ష్మి చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. గురువారం స్వామి వారికి పూలతేరు (చిన్నతేరు) నిర్వహించారు. వివిధ రకాల పూలతో తేరును సుందరంగా అలంకరించారు. అనంతరం తేరు ఊరేగింపును ప్రారంభించారు. ఉత్సాహంగా భక్తులు తేరును లాగారు. పూల రథాన్ని తిలకించడానికి ప్రజలు, భక్తులు వందలాదిగా తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. సీఐ ఆదిరెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. కాగా, గురువారం రథసప్తమి సందర్భంగా గంగాపూర్ లక్ష్మీచెన్నకేశవస్వామికి రథోత్సవం (పెద్దతేరు) నిర్వహించనున్నట్లు ఈవో దీప్తిరెడ్డితెలి పారు.



పూలరథంపై చెన్నకేశవ స్వామి

# మత్తు.. చిత్తు!

## గంజాయికి యువత బానిషా



మహబూబ్‌నగర్ మెట్టుగడ్డ, ఫిబ్రవరి 15

గంజాయి గుప్పుమంటున్నది. మహబూబ్‌నగర్ జిల్లాలో విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. రాత్రివేళల్లో యువత విచ్చలవిడిగా తిరిగి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. దారినపోతున్న వారిపై దాడులు చేస్తున్న సంఘటనలు కోకొల్లలు. దీనికి తోడు మత్తులో దొంగతనాలు సైతం చేయడానికి వెనుకాడడం లేదు.

**మత్తులో జోగుతూ.. పట్టుబడుతూ..**

మహబూబ్‌నగర్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో కొందరు యువకులు గంజాయి తాగుతుండగా పోలీసులు పట్టుకున్నారు. విచారణ మొదలు పెట్టిన వారికి నమ్మలేని నిజాలు వెల్లడయ్యాయి. గంజాయి మత్తులోనే గొడవలు, దొంగతనాలు జరుగుతున్నాయని, మత్తుకు బానిసగా మారిన యువత దానికోసం ఆత్మహత్యలకు సైతం వెనుకాడడం లేదని తేలింది. మత్తుకు అలవాటుపడిన ఓ యువకుడు నేరుగా ఒప్పుకున్నాడు. మత్తు కోసం సూసైడ్ చేసుకునేందుకు సిద్ధమవడం కూడా మనం చూస్తున్నాం. దీంతో పోలీసులు గంజాయి రవాణాపై దృష్టి పెట్టారు. యువత చెడుదారుల్లో పయనించడంపై, గొడవలకు దారితీయడం, రాత్రి వేళల్లో విచ్చలవిడిగా తిరుగుతున్నట్లు పోలీసుల నిఘాలో తేలింది. ప్రాథమిక విచారణలోనే జిల్లాలో గంజాయి సరఫరా ముఠా తిష్టవేసినట్లు పోలీసులు ఆఫ్ ది రికార్డుగా చెబుతున్నారు. ప్రధానంగా కళాశాలల్లో చదివే యువత గంజాయి మత్తులో జోగుతున్నారు. సరఫరా చేసే ముఠా జిల్లాను టార్గెట్ చేసింది. కొన్ని ప్రాంతాల్లో నిర్ధిష్ట సమయాలను ఎంచుకొని అమ్మకాలు సాగిస్తున్నారు. సాయంత్రం నుంచి రాత్రి వరకు ఎక్కువగా అమ్మకం సాగిస్తున్నట్లు సమాచారం. పలు ప్రాంతాల నుంచి విచ్చలవిడిగా వస్తున్నట్లు తెలుస్తున్నది.

**సరిహద్దులు దాటి..**

పాలమూరు జిల్లాను అనుసరించి ఉన్న ప్రాంతాల నుంచి గంజాయి సరఫరా జోరుగా సాగుతున్నది. పోలీసులకు దొరకకుండా ప్రత్యేక వాహనాల్లో కాకుండా ఆర్టీసీ బస్సులు, రైళ్లల్లో గుట్టుచప్పుడు కాకుండా రవాణా చేస్తున్నారు. ద్విచక్ర వాహనాలతో సైతం తరలిస్తున్నారు. నల్లమల అటవీ ప్రాంతం గంజాయి విక్రయాలకు కేంద్రంగా మారినట్లు అనుమానాలు ఉన్నాయి. ఏపీలోని కొన్ని ప్రాంతాల నుంచి ఎక్కువగా నల్లమల, అచ్చంపేట మీదుగా.. తరలించి అక్కడి నుంచి పాలమూరుకు డిస్ట్రిబ్యూట్ చేస్తున్నట్లు సమాచారం. అలాగే కర్ణాటకలోని రాయిచూర్ నుంచి గంజాయి ఎక్కువగా దిగుమతి అవుతున్నది. కొన్ని ప్రైవేట్, ఉన్నత విద్యా కళాశాలల్లో గంజాయి ఎక్కువగా విక్రయిస్తున్నట్లు అనుమానాలు ఉన్నాయి. జిల్లా కేంద్రం శివారులోని గుట్టల ప్రాంతంలో ఉన్న కళాశాల పరిసరాల్లో విక్రయాలకు ప్రత్యేక ముఠాలు ఏర్పడినట్లు పోలీసులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

**కన్నపేగుకు గుండెకోత**

జిల్లాలో గంజాయి విక్రయం పెరిగిపోయింది. రెండేండ్ల కిందటి వరకు విచ్చలవిడిగా సాగిన గంజాయి అమ్మకాలపై పోలీసులు ఉక్కుపాదం మోపడంతో కొంతకాలం నిలిచాయి. తర్వాత చాపకింద నీరులా దందా జోరందుకున్నది. ఇటీవల జరుగుతున్న వరుస దొంగతనాలకు ప్రధాన కారణం గంజాయి మత్తులోనే యువత చేస్తున్నారని తేలింది. ఇక తల్లిదండ్రులు, పిల్లల అలవాట్లపై ఆందోళన చెందుతున్నారు. నిన్న, మొన్నటి వరకు సక్రమంగా ఉన్న తమ బిడ్డలు ఒక్కసారిగా మారిపోవడం వారికి కంటిమీద కునుకులేకుండా చేస్తున్నది. పిల్లల అలవాట్లు, మత్తు వినియోగంపై ఎవరికీ చెప్పుకోలేక దవాఖానల చుట్టూ తిరుగుతున్నారు.

**పట్టుబడుతున్న యువత**

గంజాయికి బానిసైన యువత ఇటీవల రాత్రి వేళల్లో రోడ్డుపై వెళ్తున్న ఓ లారీ అద్దాలు పగలగొట్టి ఘర్షణకు దిగారు. మరో సంఘటనలో మహబూబ్‌నగర్ టీచర్స్ కాలనీ పార్కులో కొందరు యువకులు గంజాయి తాగుతూ మత్తులో కొట్టుకున్నారు. ఓ బర్త్ డే వేడుకల్లో గంజాయి సేవించి పార్కులో యువకులు న్యూసెన్స్ చేశారు. ఇలాంటి సంఘటనలు ఎన్నో ఉన్నాయి.. పోలీసులు కేసులు నమోదు చేసినవి కూడా ఉన్నాయి. పలు ముఠాల వివరాలు, విక్రయ కేంద్రాలపై పోలీసులు నిఘా పెట్టి అరికట్టేందుకు పకడ్బందీ చర్యలు చేపట్టారు.



గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్న పోలీసులు(ఫైల్)

- ఉమ్మడి జిల్లాలో గుప్పుమంటున్న వైనం
- రాయిచూర్, నల్లమల నుంచి సరఫరా
- విక్రయాలు జరిపేందుకు ప్రత్యేక మాఫియా
- కార్మికులు, విద్యార్థులే లక్ష్యంగా అమ్మకాలు
- సరదాగా మొదలై.. వ్యసనంగా మారుతూ..
- మత్తులో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్న యూత్
- అనారోగ్యాలతో చికిత్స పొందుతున్న పలువురు..
- తల్లిదండ్రులు జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్న పోలీసులు

**హాట్‌స్పాట్లు ఇవే..**

ఎన్‌హెచ్-44 వెంట ఉన్న బాలానగర్, రాజాపూర్, జడ్చర్ల, భూత్పూర్, మూసాపేట, అడ్డాకుల, కొత్తకోట, పెబ్బేరు, మానవపాడు, అలంపూర్ ప్రాంతాల్లోని దాబాలు, పాన్ డబ్బాల్లో గంజాయి విక్రయిస్తున్నారు. నల్లమలలోని పలు గ్రామాల్లో మత్తు పంటను సాగు చేసి అక్కడి నుంచి గుట్టుచప్పుడు కాకుండా రవాణా చేస్తున్నారు. పాలమూరులోని రామయ్యబౌలి, ఏనుగొండ, బోయపల్లి, మోతీనగర్, కొత్త చెరువు రోడ్, గంజ్, షాషాబ్‌గుట్ట, ప్రేమ్‌నగర్, రైల్వే స్టేషన్, ఆర్టీసీ బస్టాండ్, జడ్చర్లలోని నిమ్మబావిగడ్డ, సిగ్నల్‌గడ్డ, రైల్వే స్టేషన్, పోలేపల్లి సెజ్ ప్రాంతాల్లో విక్రయాలు జోరుగా సాగుతున్నట్లు తెలిసింది. కోస్గి, నారాయణపేట మక్తల్, వనపర్తి, గద్వాల, నాగర్‌కర్నూల్, కల్వకుర్తి, కొల్లాపూర్, అచ్చంపేట, బల్మూరు, లింగాల ప్రాంతాల్లో దందా మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతున్నట్లు సమాచారం. పోలీసులు, ఎక్సైజ్ శాఖ అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో వ్యాపారం జోరందుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

**ప్రత్యేక బృందాలు రంగంలోకి..**



కొన్ని ప్రాంతాలు, గుట్టల శివారుల్లో ఉన్న విద్యాసంస్థల వద్ద గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం. అనుమానం వచ్చిన ప్రాంతాలపై నిఘా పెట్టాం. అమ్మకాలపై సీరియస్‌గా వ్యవహరిస్తున్నాం. ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపుతున్నాం. పోలీసులకు సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతాం. గంజాయి విక్రయించినా, అమ్మినా కఠిన చర్యలు తప్పవు. జాతీయ రహదారి వెంట ఇతర రాష్ట్రాలకు చెందిన వారి కదలికలపై నిఘా పెట్టాం.

*– మహేశ్, డీఎస్పీ, మహబూబ్‌నగర్*

**గంజాయి కేసుల వివరాలు..**

| జిల్లా | 2022 | 2023 |
|---|---|---|
| మహబూబ్‌నగర్ | 13 | 01 |
| నాగర్‌కర్నూల్ | 02 | 00 |
| వనపర్తి | 02 | 01 |
| జోగుళాంబ గద్వాల | 02 | 00 |
| నారాయణపేట | 02 | 04 |
| **మొత్తం** | **21** | **06** |



కల్వకుర్తి మార్కెట్‌లోవేరు శనగకు ప్పలు

## ఇష్టం ఉంటే అమ్మండి..
# కష్టమైతే వెళ్లండి

- కల్వకుర్తిలో రైతులను దబాయిస్తున్న వ్యాపారులు
- నేలచూపులుచూ స్తున్న వేరుశనగరే టు
- ఒకటి లేదా రెండు క్వింటాళ్లకే గరిష్ఠ ధర
- వ్యాపారస్తులతో మార్కెట్ కార్యదర్శుల కుమ్మక్కు!
- ఆందోళనలుచే సినా ఫలితం శూన్యం
- చేసేదేమీ లేక తక్కువ ధరకే విక్రయిస్తున్న వైనం
- కాంగ్రెస్ సర్కారు నిర్వాకంపై అన్నదాతలఆ క్రోశం

కల్వకుర్తి, ఫిబ్రవరి 15 : వేరుశనగ ధరలు రోజురోజుకూ నేల చూపులు చూస్తుండడంతో గత్యంతరం లేక అమ్ముకోవాల్సిన పరిస్థితి నెలకొన్నదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆందోళనలు, ధర్నాలు చేసినా ధర మాత్రం పెరగడం లేదని.. మార్కెట్‌కు తీసుకొచ్చిన వేరుశనగను వెనక్కి తీసుకుపోలేక.. ధర వచ్చే వరకు ఇక్కడే ఉంచలేక సతమతమవుతున్నారు. మార్కెట్‌కు తెచ్చిన పంట ఉత్పత్తులకు కాపలాగా ఉంటే తిండి ఖర్చులు అవుతున్నాయని, ఇంటి వద్ద ఉన్న పాడి, వ్యవసాయ పనులు పాడైపోతుండడంతో ఏ ధర వచ్చినా విక్రయించాల్సిన దౌర్భాగ్య పరిస్థితి నెలకొన్నదని అన్నదాతలు వాపోతున్నారు.

కల్వకుర్తి వ్యవసాయ మార్కెట్‌కు గురువారం 206 మంది రైతులు 8,130 బస్తాల వేరుశనగను విక్రయానికి తీసుకొచ్చారు. ట్రేడర్లు, కమీషన్ ఏజెంట్లు యథావిధిగా టెండర్లు వేసి.. గరిష్ఠంగా రూ.7,009, మధ్యస్తంగా రూ.6,209, కనిష్ఠంగా రూ.4,100 ధర నిర్ణయించారు. ఎక్కువ ధరకు ఒకటి లేదా రెండు క్వింటాళ్ల మాత్రమే కొనుగోలు చేస్తారనేది జగమెరిగిన సత్యం. రూ.4,100 నుంచి రూ.5,500కు పలికిన వేరుశనగను వ్యాపారులు కొనుగోలు చేశారు. ధర పెంచమన్నా వ్యాపారులు ఒప్పుకోలేదు. ఆందోళనలు చేస్తే ఫలితం ఉండకపోగా మరిన్ని ఖర్చులు పెరుగుతాయన్న ఉద్దేశంతో చేసిదేమీలేక విక్రయించినట్లు రైతులు తెలిపారు.

**పాలకమండలి లేకపోవడంతో..**

రైతులకు గిట్టుబాటు ధర కల్పించడం, సమస్యలను పరిష్కరించడంలో మార్కెట్ పాలకమండలి కృషి చేస్తుంది. వ్యాపారులు, రైతులకు మధ్య అనుసంధానంగా పనిచేస్తుంది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక కేసీఆర్ సర్కారు నియమించిన మార్కెట్ పాలకమండళ్లను రద్దు చేసింది. కొత్త వారిని నియమించలేదు. ఈ క్రమంలో రైతులు, వ్యాపారులకు అనుసంధానంగా నిలవాల్సిన బాధ్యత అధికారులు, మార్కెట్ కార్యదర్శిపై ఉన్నది. కానీ మార్కెట్ కార్యదర్శులు వ్యాపారులతో అంటకాగుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వ్యాపారులతో సత్సంబంధాల కారణంగా రైతుల పక్షాన మాట్లాడలేకపోతున్నారనే అపవాదును మూటగట్టుకుంటున్నారు. వ్యవసాయ మార్కెట్‌లో కార్యదర్శి పాత్ర ఏమిటనే దానిపై కొత్త నిర్వచనం వినిపిస్తున్నది. మార్కెట్‌లో లైట్లు వెలిగించడం, మరమ్మతులు చేయించడం వరకే తమ పని అని మార్కెట్ కార్యదర్శులు అంటున్నారని రైతులు విస్తుబోతున్నారు. రైతులు తీసుకొచ్చిన ధాన్యానికి మద్దతు ధర కల్పించాల్సిన బాధ్యత తమకు లేదని.. కార్యదర్శులే బాహాటంగా చెబుతుండటంతో కాంగ్రెస్ మార్కు పాలన అంటే ఇదేనేమో అని రైతులు అంటున్నారు.

**ఎగుమతులు లేకపోవడం వల్లే..**

వేరుశనగకు ప్రస్తుతం ఎగుమతులు లేకపోవడం వల్ల ధరలు తగ్గుతున్నాయని వ్యాపారులు చెబుతున్నారు. ఎక్స్‌పోర్ట్ లేదని, ఎక్కువ ధరకు కొనుగోలు చేస్తే మేం నష్టపోతామని వ్యాపారులు తమదైన శైలిలో రైతులను దబాయిస్తున్నారు. ఇష్టం ఉంటే అమ్మండి.. లేకపోతే మీ సరుకు మీరు తీసుకుపోండని హెచ్చరిస్తున్నట్లు రైతులు వాపోతున్నారు. కాయాకష్టం చేసి పండించిన పంటకు గిట్టుబాటు ధర దేవుడెరుగు.. కనీసం చేసిన కష్టానికైనా ఫలితం రావడంలేదంటున్నారు. కొనబోతే కొరివి, అమ్మబోతే అడివిలాగా తమ బతుకులు తయారయ్యాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేరుశనగ విత్తనాల కోసం ఇదే వ్యాపారుల వద్దకు వెళ్తే.. విత్తనం దొరకడం చాలా కష్టంగా ఉంటుందంటూ క్వింటాకు రూ.14వేలకు పైగానే విక్రయించారంటున్నారు. ఎగుమతులు లేకుంటే వ్యాపారులు మార్కెట్‌కు ఎందుకు వస్తున్నారని వారు ప్రశ్నిస్తున్నారు.

# కాంగ్రెస్‌ది అసమర్థ పాలన

- రైతుల గోడు పట్టించుకోని సీఎం రేవంత్
- మద్దతుధరక ల్పించడంలో విఫలం
- ప్రతిపక్షాల గొంతునొక్కుతున్న పాలకులు
- బీఆర్‌ఎస్‌జి ల్లా అధ్యక్షుడు గువ్వల



సమావేశంలో మాట్లాడుతున్నబీఆ ర్‌ఎస్‌జి ల్లా అధ్యక్షుడు గువ్వల బాలరాజు

అచ్చంపేట, ఫిబ్రవరి 15 : రైతులు రోడ్లపైకి వచ్చి మద్దతు ధర కోసం ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడంలేదని, రైతుల పక్షాల ప్రశ్నిస్తున్న బీఆర్‌ఎస్ పార్టీ గొంతునొక్కే ప్రయత్నం చేస్తున్నదని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు గువ్వల బాలరాజు అన్నారు. గురువారం ఆయన స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అచ్చంపేటలో రైతులు వారం రోజులుగా మద్దతు ధర కోసం ఆందోళన చేస్తున్నా పట్టించుకునే వారు లేరని, ఎమ్మెల్యే వంశీకృష్ణ నేటి వరకు కూడా పలకరించలేదన్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో మద్దతు ధర కల్పించి ఆదుకున్నామని, మార్కెట్‌లో ఇబ్బందిపడకుండా రైతులకు అన్నం కూడా పెట్టించామని అన్నారు. మహిళా ప్రజాప్రతినిధిపై దాడి చేసేస్థాయికి ఆందోళన చేరిందంటే రైతులు ఎంత రగిలిపోతున్నారో గ్రహించాలన్నారు. దాడికి పాల్పడిన వారిని ఇప్పటి వరకు ఎందుకు అరెస్ట్ చేయలేదని ప్రశ్నించారు. రైతులకు మద్దతు ధర కల్పించకుండా కాంగ్రెస్ తప్పించుకునే ధోరణి అవలంబిస్తుందన్నారు.

**రూ.2లక్షల రుణమాఫీ ఏమైంది?**

రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పిన హామీ ఏమైందని గువ్వల ప్రశ్నించారు. ప్రభుత్వ వైఫల్యాలపై అసెంబ్లీ మీడియా పాయింట్‌లో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు మాట్లాడకుండా గొంతుకొక్కే ప్రయత్నం చేస్తున్నారన్నారు. వందరోజుల గడువు తర్వాత ప్రజా సమస్యలపై, కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యంపై ఉద్యమిస్తామన్నారు. కేవలం బీఆర్‌ఎస్‌ను బద్నాం చేసేందుకు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు జాతరగా మేడిగడ్డకు వెళ్లారని, ప్రభుత్వ ఖజానాను దుర్వినియోగం చేస్తున్నారని మండిపడ్డారు. కేసీఆర్ ఆరోగ్యం బాగాలేక అసెంబ్లీకి రాకుంటే సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని, తెలంగాణ సాధించిన ఉద్యమనేతపై అనుచిత వ్యాఖ్యలు చేయడం మానుకోవాలని హెచ్చరించారు. కాంగ్రెస్ చేతగానితనం వల్ల తెలంగాణ చీకటిగా మారే ప్రమాదం ఉందన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ రాంబాబు, అమీనొద్దీన్, కౌన్సిలర్ రమేశ్‌రావు, రమేశ్, వైస్ ఎంపీపీ నారాయణ, నాయకులు ప్రవీణ్, బాలరాజు, కుతుబుద్దీన్, శ్రీరామ్, శంకర్‌మాదిగ, సురేశ్, శివ, మక్బూల్, శ్రీశైలం, రాజు, బాలరాజు పాల్గొన్నారు.